
# ఔట్ గోయింగ్ ఓన్లీ

- సశ్రీ



"సెల్ఫోన్ కనిపెట్టిందెవ్రా బాబూ? ఆ మాట అప్పటికి ఎన్నిసార్లు అన్నాడో శుభాకర్‌కి లెక్క తేల్లేదు.

నాలుగేళ్ల కితం ముచ్చటపడి కొనుక్కొన్న ఫోన్ మీద చచ్చేంత... కాదుకాదు చంపేంత గుర్రుగా వుంది. కొంప ముంచింది-వెధవఫోను అనుకుంటూ పీకలదాకా కోపం వచ్చింది. దాని పీక పిసికి చంపి పారేద్దామనుకున్నాడు, నేలకేసి విసిరి కొడదామనుకున్నాడు.

ఫోన్‌తో భార్య అవసరం గుర్తొచ్చి మిన్నకుండిపోయాడు. తోకతొక్కిన తాచల్లా అంట్లుతోమే కొబ్బరి పీచల్లే వొంగిపోయాడు... అవసరానికి లొంగిపోయాడు.

రాత్రి నిద్దరలో కూడా ఫోన్ గురించే కలవరించాడు... పలవరించాడు. తెల్లారుతుండనగా 'సెల్ఫోన్ కనిపెట్టిందెవరు..?' అంటూ భర్త అంత నిద్దరలోనూ అనటం చూసి భార్య తెగ కంగారుపడింది.

పొద్దున్నే లేనిపోని 'బ్రెయినాఫ్ ఆంధ్రా' క్విజ్ ఏమిటా అని లేచి కూర్చొంది.

ఔనూ.. సెల్ఫోన్ కనిపెట్టింది ఎవరూ అనుకుంటూ ఆవిష్కరణల పుస్తకం తిరగేసింది..... పుస్తకం వోడిపోయింది... జవాబు చెప్పలేక మూతి ముడుచుకుంది!

తాను టీచర్నైనందుకు ఆ ప్రశ్నకి బదులు పలక నందుకు తలకొట్టేసినట్టయింది. రేపెవరైనా స్కూల్లో అదే అడిగితే తన పరువేం కాను? అనుకుంది.

కాసేపటికి కళ్లు తెరిచాడు శుభాకర్. సెల్ఫోన్ విషయంలో ఎపుడో కళ్లు తెరచి వుండాల్సిందని వాపోయాడు.

ఏమండీ.. సెల్ఫోనంటూ వొకటే కలవరింతలు? అని మాత్రం పలకరించింది లలిత.

ఎవరు కనిపెట్టారేమిటి అని అడిగితే -ఆమె పని అంతే... సెటైరు పేలుతుంది.

"ఔన్లే ... మాకే కదా గవర్నమెంట్ ఏడువేలు యిస్తావుంది" అని దెప్పి పొడుస్తాడని మింగేసి బ్రూ కాఫీ తాగేసింది. భర్తచేత కూడా ప్రేమగా తాగించింది.

- - -

కష్టాన్ని కాఫీలా దిగమింగుకోగలిగితే ఎంత బావుణ్ను?! అనుకున్నాడు శుభాకర్. ఎసెమ్మెస్ పంపినంత తేలిగ్గా అనుకోగలం కానీ అనుభవానికొస్తే ఏదైనా తెలుస్తుంది.

బస్టాపులో లలితను దించి ఆఫీసులో కూలబడ్డాడు శుభాకర్. మళ్లా సెల్ఫోన్ గురించి

ఆలోచించే తీరిక దొరక లేదతనికి. మధ్యాహ్నం కాసింత తీరుబడి చిక్కింది.

ఆర్నెలలపాటు సినిమాలు, షికార్లు మాని అదే పనిగా చదివి 'టీవీ క్విజ్' లో పాల్గొని పదివేలు గెలుచుకొచ్చిన భార్య గుర్తొచ్చింది శుభాకర్‌కి.

తానేం చేసేడు? అర నిమిషంలో తెలివి తక్కువ గా లక్ష రూపాయలు పోగొట్టుకున్నాడు. నేరం నాదికాదు ఆకలిది లాగా తప్పు తనది కాదు ముమ్మాటికీ సెల్‌ఫోన్‌దే అని సరిపెట్టుకున్నాడు.

ఆ రోజు ఫోన్‌కాల్ వచ్చిందని ఆగమేఘాల మీద అక్కడికెళ్లాడు. ఫోన్ చేసిన మిత్రుడు ష్యూరిటీ సంతకం చేయమన్నాడు.

"మీది మూడో సంతకం" అంటూ ధైర్యం చెప్పాడు. నేనెలాంటి వాడినో మీకు తెలియదా అంటూ శ్రీరంగనీతులు చెప్పాడు.

తానే కరిగిపోయాననుకున్నాడు కానీ శుభాకర్ తరవాత కానీ తెలీలేదు. తానుకాదు కరిగింది... తన ఆదాయమని....!

అంతా బావుంటే అది జీవితమెలా ఔతుంది? లక్షరూపాయలకి గ్యారంటీ సంతకం తీసుకున్న మిత్రుడు గ్యారంటీగా ఆ సొమ్ము బ్యాంక్‌కి తీరుస్తాడులే అని శుభాకర్ వేడిపప్పులో కాలేసాడు.

మిత్రుడు టోకరా వేసాడు. అతడు కనిపించడం లేదని లబోదిబోమన్నాడు శుభాకర్. తనకి దృష్టీ, దూరదృష్టీ రెండూ లేవని గ్రహించాడు శుభాకర్. మిత్రుడి ఆచూకీ తెలుసుకోలేక పోయాడు.

నెలకి రెండువేల చొప్పున బ్యాంక్‌కి తన జీతం లోంచి కట్టక తప్పలేదు శుభాకర్‌కి.

సెల్‌ఫోన్ వల్ల శుభాకర్‌కి ఎదురైన తొలి నష్టం ఇదేనని అనుకుంటే పొరపాటు.

రెండువేల సంవత్సరం మే నెలలో సెల్‌ఫోన్ చేతికి రాగానే గొప్పగా చుట్టాలందరికీ నెంబ రిచ్చాడు శుభాకర్.

తాను చేయటం ఏమో కానీ నలుగురూ ఫోన్ చేసి తనకి చెప్పేది వినటానికే ఓ కార్డు సరిపోయేది.

ఏడాది తిరిగేసరికల్లా 'బ్యాటరీ' తినేసారు బంధు మిత్రులు... కొత్త హ్యాండ్ సెట్ కొన్నాడు ఈసారి శుభాకర్.

ఇంటి యజమాని శుభాకర్ నెంబరు ఎవరెవరికో ఇచ్చాడు... పద్దాకా ఆయన్ని పిలిచి 'మీకు ఫోన్' అనలేక సగం, ఇన్‌కమింగ్ బిల్లు భరించలేక ఇంకో సగం చచ్చూరుకున్నాడు శుభాకర్.

అపుడే ఫోన్‌కి 'టాటా' చెప్పాలనుకున్నాడు శుభాకర్. మెడలో గొలుసూ, చేతికి ఉంగరం ఉన్నా దక్కని గౌరవం సెల్‌ఫోన్ వల్ల తనకి లభిస్తున్నందుకు కుక్కిన పేనులాగా కామైపోయాడు శుభాకర్.

సెల్‌ఫోన్‌కి రెండోవార్షికోత్సవం జరుపుకునే సందర్భంలో దూరపు బంధువొకరు ఫోన్‌చేసిమరీ ఇంటికొచ్చాడు.

పన్నెండేళ్లనాడు చూడటం... మళ్లా మీ సెల్ ఫోన్ దయవల్ల ఇదిగో ఇన్నాళ్లకి.... అంటూ రాకపోకలు సాగించాడు.

ఆటో కొనుక్కుంటానంటూ పదివేలు అప్పుగా తీసుకెళ్లినవాడు మళ్లా పత్తాలేడు.

'ఏదో వుంది కాబట్టి యిచ్చాం.. పోన్లెద్దురు' అంటూ లలిత శుభాకర్‌కి ధైర్యం చెప్పింది.

మూడో వార్షికోత్సవం సందర్భంలో ఎవరో అమ్మాయినించీ 'రాంగ్ కాల్స్' మొదలై మింగలేక కక్కలేక ఇక్కట్లు పడ్డాడు శుభాకర్. నెంబరు ఖచ్చితంగానే చెబుతోంది కానీ వేరెవరిపేరో అంటోంది.

ఎవరు తన మీద కుట్ర చేస్తున్నారో కనిపెట్టలేక పోయాడు శుభాకర్.


**శుభాకాంక్షలు**

'చినుకు' అన్నపేరే అద్భుతంగా ఉంది. చాలా కాలంగా తెలుగులో మంచి సాహిత్య పత్రిక లేని లోటును 'చినుకు' తీరుస్తుందని ఆశిద్దాం. మంచి విశ్లేషణాత్మక, విమర్శనాత్మక వ్యాసాలతో 'చినుకు' పాఠకులను ఎడ్యుకేట్ చేయాలని ఆశిస్తూ...

శుభాకాంక్షలతో...

**డా॥ జూపల్లి ప్రేమ్‌చంద్**

అనంతపురం జిల్లా రచయితల సంఘం

ఇదిగో ఇపుడు లక్షరూపాయలకి నిలువునా మోసపోయాడు.

- - -

'ఈ మధ్య సెల్‌ఫోన్ వాడుతున్నట్టు లేరు... అదేంటండీ ఇన్‌కమింగ్ ధరల్లోనే వాడిన మీరు ఇపుడిలా ... ' అంటూ అడిగి అడిగి మిత్రులు నోర్మూసుకున్నారు. అన్ని యక్ష ప్రశ్నలకీ జవాబిచ్చిన తన చిరునవ్వును చూసి తానే నవ్వుకున్నాడు శుభాకర్. ఇవ్వాళ సెల్‌ఫోన్ పెద్ద ఫ్యాషనై పోయింది. ఏడో తరగతి పిల్ల చేతిలోనూ సెల్లే... విసుక్కున్నాడు శుభాకర్.

టెక్నాలజీ వల్ల ఓ వంక లాభం... ఇంకో వంక నష్టం అని తెల్సుకున్న శుభాకర్ నెంబరు మార్చే సాడు.

ఇపుడా ఫోన్‌లో పుట్టింటివాళ్ళతో తరచూ మాటాడుతుంది లలిత.

శుభాకర్ కూడా ఎవరికైనా తాను ఫోన్ చేయటమే కానీ తనకెవరూ ఫోన్ చేయకుండా జాగ్రత్త పడ్డాడు. మూణ్నెల్లుగా ఇదే పద్ధతి పాటిస్తు న్నారు ఆలుమగలు. ఇదేదో హాయిగా వున్నట్టని పించింది!

ఎవరికీ ఫోన్ చేసే స్థోమతు లేక ఎవరైనా పలక రిస్తే అందుబాటులో వుండేందుకు 'ఇన్ కమింగ్ ఓన్లీ' పథకానికి అంతా పరుగులు తీస్తుంటే శుభాకర్ తీరే వేరు. 'ఔట్ గోయింగ్ ఓన్లీ' అంటూ శుభాకర్ ఫోన్ నిద్దరపోతోంది. భార్యతో శుభాకర్ కూడా అంతే ప్రశాంతంగా గడుపుతున్నాడు ! కూత పెట్టకుండా, ఆలుమగల సంసార ఏకాగ్రతకి భంగం కలిగించ కుండా మౌనవ్రతం పాటిస్తోందా ఫోన్. ❖

కళా, సాహితీ, సాంస్కృతిక, రాజకీయ రంగాలకి సంబంధించి ఏ విషయం మీదైనా మాట్లాడగల, రాయగల నైపుణ్యతని నిత్య పఠనం ద్వారా సొంతం చేసుకున్న ఆంగ్లాంధ్ర ఉపన్యాసకుడు ఈ కథారచయిత "సత్రీ".
పేరు చిన్నదయినా 'ఉనికి' అనంతమైనదన్న విషయం పాఠకులకు చిరపరిచితం.

# వారసత్వం

- నిఖిలేశ్వర్

రక్షణకోసం
ఆ గోడల్ని మనమే నిర్మించాం
అశాంతినుంచి
ఊరటపొందాలని
తాండవ నృత్యం చేసాం,
ముప్పిరిగొన్న చీకటిని చీల్చి
వెలుగును ప్రసాదించమని
పుస్తకాలను మనమే రాసుకున్నాం!
తరాలు గడచిపోగా
వేలాది వత్సరాల గమనంలో
ఆ గోడలు
మరింత పైకిలేచాయి
పుస్తకాల పుటలు అతుక్కుపోగా
మతం గిరిగీసిన మార్గాల్లో
మళ్ళీ అశాంతి పెరిగింది
తప్పదని గోడల్ని కూల్చేసాం
పుస్తకాలను
గ్రంథాలయాల్లో భద్రపరిచాం,
ప్రజా ఉద్యమాల ఆటుపోటుల్లో
భూమి రుణం తీర్చుకున్న
త్యాగధనుల రక్త తర్పణం,
ఇప్పుడిక గుండె ద్వారాలు తెరిచి
దూరంగా చూపు సారించే సరికి
సమాంతరంగా పరిగెడుతూ
అనుభవాల వారసత్వంలో
ఈ తరం...... !!

☞ ఈ కవి తెలుగు సాహిత్య చరిత్రలో పంచలనం సృష్టించిన ఉద్యమ రథ సారథుల్లో ఒకరు. ఆ చరిత్ర దిగంబర కవితోద్యమం అని మీకు తెలిసిందే.